AKSHARA TODAY

అక్షర టుడే


TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

నాణ్యమైన విద్యుత్‌తో పంటలకు భరోసా



2



2

విదేశీ, డిఫెన్స్ మద్యం స్వాధీనం

13న జుక్కల్‌లో బతుకమ్మ సంబరాలు



అక్షరటుడే, ఎల్లారెడ్డి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుంది. దీనిని పురస్కరించుకుని జుక్కల్‌లో ఎల్‌కేఆర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు-2026 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 13న ఈ వేడుకలు జరుగనున్నాయి. బతుకమ్మ సంబరాల్లో భాగంగా నిర్వహించే పోటీల్లో విజేతలకు భారీ నగదు బహుమతులు అందించనున్నారు. మొదటి బహుమతిగా రూ.51 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు, మూడో బహుమతిగా రూ.11 వేల నగదును ప్రకటించారు. వీటితోపాటు మరో ఎనిమిది మందికి ప్రత్యేక బహుమతులు అందించనున్నారు.



కాకతీయ ప్రధాన కాలువకు నీటి విడుదల ప్రారంభం

అక్షరటుడే, పోచంపాడ్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ ప్రధాన కాలువ (ఎల్ఎండీ ఎగువ ప్రాంతం) ఆయకట్టు కోసం అధికారులు నీటిని విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల చేపట్టినట్లు ఇరిగేషన్ సర్కిల్ పోచంపాడ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. జగదీష్ తెలిపారు.

2000 క్యూసెక్కుల నీరు..

శనివారం ఉదయం 9 గంటలకు 2,000 క్యూసెక్కుల సాగునీటిని అధికారులు విడుదల చేశారు. అనంతరం నీటి విడుదలను క్రమంగా పెంచనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వలు లేనందున, విడుదల చేసిన సాగునీటిని రైతులు సక్రమంగా, పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



రెడ్ క్రాస్ ఈసీ మెంబర్ సుధాకర్‌కు దిల్‌రాజు సన్మానం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో మేనేజింగ్ కమిటీ మెంబర్ నరాల సుధాకర్ విజయం సాధించారు. ఆయన మర్యాదపూర్వకంగా సినీ నిర్మాతలైన దిల్ రాజు, శిరీష్ రెడ్డిలను హైదరాబాద్‌లో కలిశారు. రెడ్ క్రాస్ ఎన్నికల్లో విజయం సాధించిన నరాల సుధాకర్‌ను దిల్ రాజు, శిరీష్ రెడ్డిలు అభినందించారు. ముమ్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నరాల సుధాకర్ మాట్లాడుతూ.. తనని ఒక కుటుంబ సభ్యులుగా భావిస్తున్న దిల్ రాజు, శిరీష్ రెడ్డి, వారి కుటుంబసభ్యులకు సదా రుణపడి ఉంటానన్నారు. మరింత ఉత్సాహంతో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొంటానని నరాల సుధాకర్ అన్నారు.



కామారెడ్డి జిల్లా కేంద్రంగా మారి దశాబ్దం అవుతోంది. అయినా అభివృద్ధి మాత్రం ముందుకు సాగడం లేదు. పరిపాలన దగ్గరయినా.. వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంగా మారినా.. కామారెడ్డి పట్టణం స్థితిగతులు మారలేదు. అధ్వానంగా ఉన్న రోడ్లు, ట్రాఫిక్ సమస్య.. పట్టణాసులను ఇబ్బంది పెడుతోంది. అయినా నాయకులు చర్యలు తీసుకోవడం లేదు.

- అక్షరటుడే, కామారెడ్డి

అభివృద్ధి అంతంతమాత్రమే..

■ 11 అక్టోబర్ 2016లో కొత్త జిల్లాగా ఏర్పాటు ■ అభివృద్ధిపై ఆశలు పెట్టుకున్న ప్రజలు
■ జిల్లా కేంద్రమైనా మారని పట్టణ స్థితిగతులు ■ వెక్కిరిస్తున్న సమస్యలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కామారెడ్డి డివిజన్‌ను విడదీసి 2016 అక్టోబర్ 11న ప్రత్యేక జిల్లాగా ప్రకటించారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, జిల్లా కోర్టుతో పాటు అన్ని జిల్లాస్థాయి కార్యాలయాలు కామారెడ్డికి వచ్చాయి. ఈనెల 11 నాటికి జిల్లా ఏర్పడి 9 ఏళ్లు పూర్తి చేసుకుని పదో ఏట అడుగుపెడుతోంది. ఈ క్రమంలో పదేళ్ల జిల్లా పాలనలో అభివృద్ధిపై ప్రత్యేక కథనాలు 'అక్షరటుడే' పాఠకుల కోసం..

అభివృద్ధిపై గంపెడాశలు..

జిల్లా ఏర్పాటుతో తమ తలరాత మారుతుందని ప్రజలు భావించారు. పరిశ్రమలు వస్తాయి, యువతకు ఉపాధి దొరుకుతుంది, మెరుగైన రోడ్లు, విద్య, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశపడ్డారు. చిన్న పనికైనా నిజామాబాద్ వెళ్లాల్సిన బాధ తప్పుతుందని సంతోషించారు. ఆ ఆశలతోనే జిల్లా ఏర్పాటును ఘనంగా స్వాగతించారు.

మారని పట్టణ స్థితిగతులు

పేరుకు జిల్లా కేంద్రమే అయినా కామారెడ్డి పట్టణ రూపురేఖలు మాత్రం మారలేదు. నగరంలోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారులు జలమయమవుతున్నాయి. వంద పడకల ఆస్పత్రిలో పడకల సంఖ్య పెరిగినా జిల్లా ఆస్పత్రిలో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీరలేదు. మెడికల్ కాలేజీ మంజూరైనా పూర్తి స్థాయి వసతులు అందుబాటులోకి రాలేదు. కొత్త బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రింగ్ రోడ్డు వంటి ప్రతిపాదనలు ఇంకా కాగితాలకే పరిమితమయ్యాయి.

వెక్కిరిస్తున్న సమస్యలు

తొమ్మిదేళ్లు గడిచినా సమస్యలు అలాగే వెక్కిరిస్తుండటంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వ్యవసాయ ఆధారిత జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు, అనుకున్నంతగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రాక రైతులు నష్టపోతున్నారు. ఒక్క పెద్ద పరిశ్రమ కూడా రాకపోవడంతో యువత ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి. 'జిల్లా అయ్యింది కానీ కలెక్టర్ ఆఫీసు భవనం తప్ప కొత్తగా వచ్చింది ఏమీ లేదు' అని స్థానికులు వేలెత్తి చూపుతున్నారు.

మెడికల్ కాలేజీ వచ్చినా వసతులు శూన్యం

జిల్లా ప్రజల చిరకాల కోరిక మెడికల్ కాలేజీ.. ఆ కోరిక నెరవేరి కాలేజీ మంజూరైనా, అందుకు తగ్గ వసతులు లేక విద్యార్థులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధ్యాపకుల కొరత, ల్యాబ్ సౌకర్యాల లేమి, హాస్టల్ సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయి. జిల్లా ఆస్పత్రిని బోధనాసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామన్న హామీ నెరవేరలేదు. దీంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం ఇప్పటికీ హైదరాబాద్, నిజామాబాద్ వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

రాజకీయంగా కీలకం.. అభివృద్ధిలో వివక్ష..?

రాష్ట్ర రాజకీయాల్లో కామారెడ్డి జిల్లా ఎంతో కీలకం. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరూ ఇక్కడి నుంచే పోటీ చేసిన నేపథ్యంలో జిల్లా.. రాష్ట్ర వ్యాప్తంగా ఫోకస్ అయ్యింది. అయినా ఆ స్థాయిలో నిధులు, ప్రాజెక్టులు రాలేదనే విమర్శ ఉంది. కాళేశ్వరం ప్యాకేజీలో భాగమైన ప్యాకేజీ 21, 22, 23 రిజర్వాయర్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. పదేళ్ల ప్రస్థానంలో పాలన దగ్గరైనా, అభివృద్ధి మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిందనే చర్చ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పెండింగ్ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిపై సోలార్‌తో జీరో కరెంట్ బిల్లు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: గృహ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకుని, కరెంట్ బిల్లును జీరో చేసుకోవచ్చని టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పీవీ రాజేశ్వర్ రావు తెలిపారు. 'పీఎం సూర్య ఘర్ - ముఫ్త్ బిజ్లీ యోజన' ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక కిలోవాట్ యూనిట్ ఇంటిపై అమర్చుకుంటే రూ.30,000 సబ్సిడీ లభిస్తుందన్నారు. అలాగే 2 కిలోవాట్ యూనిట్‌కు రూ. 60,000, 3 కిలోవాట్ లేదా అంతకంటే ఎక్కువ యూనిట్ ఇంటిపై అమర్చుకుంటే గరిష్ఠంగా రూ.78,000 వరకు సబ్సిడీ లభిస్తుందని ఆయన వివరించారు. 3 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ద్వారా నెలకు దాదాపు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ఎస్ఈ వివరించారు. దీని కోసం బ్యాంకులు కూడా తక్కువ వడ్డీకే రుణ సదుపాయం అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు అధికారిక వెబ్‌సైట్ PMSURYAGHAR.GOV.IN ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.





హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

అక్షరటుడే, డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలో నాగ్‌పూర్ గేట్ హైవేపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ అధికారులు, నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై పరిశీలన జరిపి, హైవేపై కీలకమైన ప్రాంతాల్లో ఎల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు.
ఏసీపీ ప్రకాశ్, డిచ్ పల్లి సీఐ వినోద్, ఎస్సై ఆరిఫ్, ఇందల్వాయి టోల్ ప్లాజా మేనేజర్ వీరబాబు, నేషనల్ హైవే మేనేజర్ సతీష్ స్వయంగా పాల్గొని ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు. వాహనాల అతివేగాన్ని తగ్గించడం, రంబుల్ స్ట్రిప్స్ ద్వారా వచ్చే శబ్దం, కంపనంతో డ్రైవర్లను అప్రమత్తం చేయడం, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించడం ఉద్దేశమని వారు పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని, నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలను నడిపి సురక్షితమైన ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు.



దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలకు మాజీ ఎమ్మెల్యే

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దుబాయ్‌లో జరగనున్న బతుకమ్మ సంబరాలలో పాల్గొనేందుకు నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల వెళ్లారు. ఈ మేరకు శనివారం ఆయనను దుబాయ్ ఎయిర్‌పోర్టులో తెలంగాణ వాసులు ఘనస్వాగతం పలికారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, బీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ బిగాల మహేష్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును కాలరాసే చర్యలను నిలిపివేయాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఓటు హక్కును కాలరాసే చర్యలను వెంటనే నిలిపివేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐపీఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, ఆర్‌వైఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురాం నాయక్ మాట్లాడుతూ, భారతదేశానికి ప్రజాస్వామ్యం ప్రాణవాయువు అయితే ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు వెన్నెముక లాంటిదని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతోందన్నారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయనే ఆరోపణల పేరుతో విచక్షణారహితంగా ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడం సరైన విధానం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విష్ణేష్, ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుభోద్, రంజిత్ పాల్గొన్నారు.

కామారెడ్డిలో భారీఎత్తున గంజాయి పట్టివేత

అక్షరటుడే, కామారెడ్డి : పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ అధికారులు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని కాంకేర్ నుంచి సోలాపూర్ వెళ్తున్న నాగావళి ఎక్స్ ప్రెస్‌లో ఎండు గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందం కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో సూట్‌కేసుతో వెళ్తుండగా పట్టుకుని విచారించారు. అతని వద్ద 18 కిలోల ఎండు గంజాయి లభించగా.. దీని విలువ సుమారు రూ.9 లక్షలుగా పోలీసులు గుర్తించారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన 26 ఏళ్ల వయసున్న అశోక్‌గా గుర్తించినట్లు సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి తెలిపారు. జిల్లాలో గంజాయి సరఫరా కట్టడికి ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ సీఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ అమృత్ రెడ్డి, రాజు, శిరీష పాల్గొన్నారు.



అంతర్జాతీయ స్థాయిలో ఇందిరాగాంధీ స్టేడియం నిర్మాణం



అక్షరటుడే, కామారెడ్డి : పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఎంఎస్ఎన్ కంపెనీ వారి సహకారంతో రూ.7.68 కోట్లతో స్టేడియంలో లాల్ బహదూర్, ఉప్పల్ స్టేడియం తరహాలో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. స్టేడియం పరిశీలన సమయంలో మహిళా క్రీడాకారులకు టాయిలెట్స్ సౌకర్యం లేదని తన దృష్టికి తెచ్చారని, వెంటనే టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే రూ.25 లక్షల వ్యయంతో గ్రౌండ్ లెవలింగ్, డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో 78 పిల్లర్లతో రూ.8 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం పనులు కొనసాగుతున్నాయన్నారు. స్టేడియంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. గతంలో లేని విధంగా అంగరంగ వైభవంగా లేజర్ షో నిర్వహిస్తామని, ఉత్సవాలకు పార్టీలకు అతీతంగా అందరికి ఆహ్వానం పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, కామారెడ్డి సొసైటీ ఛైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

చాయ్‌వాలా కుటుంబానికి అండగా నిలిచిన లిటిల్ ఫ్లవర్ స్కూల్!



అక్షరటుడే, భీమ్‌గల్: రోజూ కష్టపడితేనే కానీ పొట్ట నిండని ఆ చాయ్‌వాలా అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబాన్ని చూసి చలించిపోయిన ఓ విద్యాసంస్థ అధినేత.. మానవత్వాన్ని చాటుకుంటూ ముందుకు వచ్చారు. ఇటీవల మృతి చెందిన స్థానిక చాయ్‌వాలా పొలాస సుధాకర్ కుటుంబాన్ని శనివారం లిటిల్ ఫ్లవర్ పాఠశాల యజమాని డాక్టర్ షఫీ పరామర్శించారు. వారి కష్టాన్ని ఓదార్చుతూ మృతుని భార్యకు రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ యూనియన్ ప్రతినిధులు శేఖర్, హరీష్, ఇక్బాల్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు ఆజాద్ గ్రౌండ్ ముస్తాబు



అక్షరటుడే,ఎల్లారెడ్డి: పట్టణంలోని 8వ వార్డు ఆజాద్ గ్రౌండ్‌లో బతుకమ్మ సంబరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 8వ వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ జీవన్, 9వ వార్డు కౌన్సిలర్ తిరుపతి మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. మైదానాన్ని పరిశుభ్రం చేయడంతో పాటు, మహిళలు సాయంత్రం వేళల్లో సైతం సౌకర్యవంతంగా బతుకమ్మ ఆడుకునేందుకు అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీధర్ గుప్తా పేర్కొన్నారు. మైదానంలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, బతుకమ్మ ఆడే ప్రదేశంలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బతుకమ్మ నిమజ్జనం నిర్వహించే చెరువులు, కుంటల వద్ద కూడా మహిళలు, చిన్నారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీ ముఠా సభ్యుడి అరెస్ట్



అక్షరటుడే, కామారెడ్డి: ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్ చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాలో కీలక నిందితుడిని భిక్కనూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ వివరాలు వెల్లడించారు. భిక్కనూర్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడుతున్న ముఠాలోని బబ్లీత్ సింగ్ చతుర్ సింగ్ తక్, రూప్ సింగ్ చతుర్ సింగ్ తక్, లఖన్ చతుర్ సింగ్ తక్‌లను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసి సెప్టెంబర్ 11న కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడైన తక్ షంషేర్ సింగ్ పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం మరో నేరానికి పాల్పడేందుకు రెక్కీ నిర్వహిస్తుండగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 54 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడు మృతి

అక్షరటుడే నిజామాబాద్ సిటీ: విధుల్లో ఉన్న మున్సిపల్ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలో శనివారం చోటుచేసుకుంది. నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికుడు భూమయ్య శనివారం డివిజన్ నెంబర్. 57లో టాటా ఏస్ లోడర్ గా పనిచేస్తున్నాడు. అయితే ఆకస్మాత్తుగా ఆయనకు ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. వెంటనే స్పందించిన సానిటరీ ఇన్స్పెక్టర్ జీవన్, సిబ్బంది అతడిని నగరంలోని జీజీహెచ్ కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఫిట్స్ వచ్చిన తర్వాత అతడికి గుండెపోటు రావడంతో మృతి చెందాడని ధృవీకరించారు. దీంతో మున్సిపాలిటీలో విషాదం నెలకొంది.

వ్యవసాయానికి విద్యుత్ వెన్నెముక. సాగు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంటాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కీలక ముందడుగు పడింది. ఎనిమిది సబ్ స్టేషన్ల ఏర్పాటులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



నాణ్యమైన విద్యుత్‌తో పంటలకు భరోసా

■ ఎల్లారెడ్డి నియోజకవర్గానికి రూ.22.84 కోట్లతో 8 సబ్‌స్టేషన్లు
■ మంజూరుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవ ■ హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

రైతుల విద్యుత్ కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వాన్ని ఒప్పించడంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ సఫలీకృతమయ్యారు. ఆయన కృషితో నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రూ.22.84 కోట్ల అంచనా వ్యయంతో ఎనిమిది 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు మంజూరు లభించింది. ఈ నిర్ణయం వ్యవసాయ విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనుంది.

రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సరఫరా సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ సబ్‌స్టేషన్ల అవసరాన్ని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందులను వివరించి, సబ్‌స్టేషన్ల మంజూరుకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం 8 సబ్‌స్టేషన్లకు అనుమతులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు మండలాల్లో..

సదాశివనగర్ మండలానికి మూడు, లింగంపేట, రామారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, ఎల్లారెడ్డి మండలాలకు ఒక్కొక్కటి చొప్పున సబ్ స్టేషన్లను కేటాయించారు. సదాశివనగర్ మండలంలోని ధర్యారావుపేటలో సబ్ స్టేషన్‌కు రూ.2.68 కోట్లు మంజూరయ్యాయి. అలాగే కుప్రియాల్‌కు రూ.2.63 కోట్లు, తిమ్మోజివాడిలో సబ్ స్టేషన్‌కు రూ.2.35 కోట్లు కేటాయించారు.. లింగంపేట మండలంలోని లింగంపల్లిరి రూ.3.37 కోట్లు, రామారెడ్డి మండలంలోని గిద్దలో సబ్‌స్టేషన్‌కు రూ.2.83 కోట్లు, నాగిరెడ్డిపేట మండలంలో వదల్‌పర్తికి రూ.2.62 కోట్లు, గాంధారి మండలంలో గుర్జాల్‌కు రూ.3.03 కోట్లు, ఎల్లారెడ్డి మండలంలో వెల్లుట్లకు రూ.3.33 కోట్లు మంజూరయ్యాయి.

లో వోల్టేజీ సమస్యలకు చెక్..

నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ పంపిణీ సామర్థ్యం పెరిగి, తక్కువ వోల్టేజీ సమస్యలు, సరఫరాలో అంతరాయాలను తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా వ్యవసాయ మోటార్లకు అవసరమైన నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ కేంద్రాలు దోహదపడనున్నాయి. సాగు సమయంలో విద్యుత్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు తగ్గితే రైతులకు సమయం ఆదా కావడంతోపాటు వ్యవసాయ పనులు సజావుగా సాగేందుకు అవకాశం ఏర్పడుతుంది.

అభివృద్ధికి మరో ముందడుగు

రైతుల సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మదన్ మోహన్ పేర్కొన్నారు. 8 సబ్‌స్టేషన్ల మంజూరుతో నియోజకవర్గంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. మొత్తంగా రూ.22.84 కోట్లతో చేపట్టనున్న ఈ విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ ఎల్లారెడ్డి నియోజకవర్గ రైతులకు ప్రయోజనం చేకూర్చే కీలక నిర్ణయంగా నిలవనుంది. అయితే ఈ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందాలంటే సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేసి, వాటిని అందుబాటులోకి తీసుకురావడం కీలకం.

పాఠశాలకు సైన్స్ ల్యాబ్ కిట్ అందజేత



అక్షరటుడే, బోధన్: చదువుకున్న బడి రుణం తీర్చుకునేలా ఎడపల్లి ఏఆర్‌పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. 1996-97 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థుల ప్రయోగాత్మక విద్యకు ఉపయోగపడేలా 'సైన్స్ ల్యాబ్ కిట్'ను పాఠశాలకు బహూకరించారు. అంతేకాకుండా ప్రైమరీ స్కూల్ చిన్నారుల బాత్‌రూమ్స్ అత్యవసర మరమ్మతుల కోసం తక్షణ సహాయంగా రూ.5,000 నగదును ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్తుకు తమ వంతుగా అండగా నిలవడం సంతృప్తిగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.



ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలో అమావాస్యను పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, 8వ వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా పాల్గొని అన్న ప్రసాద వితరణలో భాగస్వాములయ్యారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవా కార్యక్రమమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, మానవతా విలువలను పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావనతో పాటు సేవాభావాన్ని చాటిచెప్పేలా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధి శ్రీధర్ గుప్తాతో పాటు మర్మల వెంకటేశం, సిద్ధి చక్రధర్, విఠల్, సాయినాథ్, మాశెట్టి వెంకటేశం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ ఎస్సై శైలేందర్‌కు ఘన సన్మానం



అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ పోలీస్ స్టేషన్ ఎస్సై శైలేందర్‌ను శనివారం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.మనోహర్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో భాగంగా మండల ప్రజలకు ఎస్సై అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ప్రజల మన్ననలు పొందేలా ఎస్సై శైలేందర్ భవిష్యత్తులోనూ ఇదే విధంగా సేవలు కొనసాగించాలని అధ్యక్షుడు మనోహర్ ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసు అధికారులను గౌరవించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామరాజు గౌడ్, ఉపసర్పంచ్ స్వామినాథ్, వీడీసీ అధ్యక్షుడు కొండ అశోక్, హనుమంతు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, సలహాదారులు బి. రామచంద్ర, కొండ నర్సయ్య, ఎం.నాగభూషణం, శ్రీనివాస్ రెడ్డి, సాయి, ఉపాధ్యక్షుడు వడ్డెన్న, జేమ్స్, సత్యనారాయణ, మహేందర్ గౌడ్, బి.రాజేందర్, గంగాధర్, అల్లె ప్రసాద్ పాల్గొన్నారు.

విదేశీ, డిఫెన్స్ మద్యం స్వాధీనం



అక్షరటుడే, నిజామాబాద్‌క్రైం: నగరంలో అక్రమంగా నిల్వ ఉంచిన విదేశీ, డిఫెన్స్ మద్యాన్ని స్వాధీనపర్చుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. నగరంలోని న్యాల్‌కల్, ముబాకర్‌నగర్‌లో ఇద్దరు వ్యక్తుల వద్ద విదేశీ, డిఫెన్స్ మద్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో మూడ భాస్కర్, కంఠాల గంగారత్నం ఇళ్లలో 110 బాటిళ్ల మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బాటిళ్లను వారు విదేశాల నుండి వచ్చిన వారి నుండి కొనుగోలు చేశారని.. అలాగే ఇతర మార్గాల ద్వారా డిఫెన్స్ మద్యం తక్కువ ధరకు కొనుగోలు చేశారన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో సరిత, సిబ్బంది నజీర్ హుస్సేన్, గజేందర్, వి. రవి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆటోడ్రైవర్



అక్షరటుడే, ఆర్మూర్: ఆటో డ్రైవర్ తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఓ ప్రయాణికురాలు తన ఆటోలో బ్యాగ్ మరిచిపోగా.. తిరిగి ఆమెకు అందించాడు. వివరాల్లోకి వెళ్తే.. మామిడిపల్లి చౌరస్తా నుండి చెన్నై షాపింగ్ మాల్‌కు ఆటోలో మేతరి సంధ్య ప్రయాణించింది. అయితే ఆమె ఆటోలో తన బ్యాగ్ మరిచిపోయి దిగిపోయింది. దీనిని గమనించిన డ్రైవర్ సాయి ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆ బ్యాగ్‌ను పోలీసులకు అందజేశారు. విచారణ చేసిన పోలీసులు మేతరి సంధ్యకు తిరిగి బ్యాగ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌ను పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై రజనీకాంత్‌లు సన్మానించారు.

క్యాన్సర్ బాధితురాలికి డాక్టర్ షఫీ అండ



అక్షరటుడే, భీమ్‌గల్: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ ఆపరేషన్‌కు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్న ఓ పేద మహిళకు విద్యాసంస్థల అధినేత డాక్టర్ షఫీ షేక్ అండగా నిలిచారు. బెజ్జోరా గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లక్ష్మి తీవ్ర అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి రాగా.. ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇబ్బందిపడుతోంది. ఈ విషయం తెలిసిన 'బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్' వ్యవస్థాపకుడు, లిటిల్ ఫ్లవర్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ షఫీ షేక్ శనివారం ఆమెకు ఆర్థిక సహాయం అందజేశారు.

చంద్రయాన్ పల్లి శివారులో రోడ్డు ప్రమాదం

అక్షరటుడే, డిచ్‌పల్లి: ఇందల్వాయి మండలం చంద్రయాన్ పల్లి శివారులో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఒకే వరుసలో రోడ్డుపై మూడు లారీలు, రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. కామారెడ్డి నుండి ఇందల్వాయి వైపు వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు, డ్రైవర్లకు చిన్నపాటి గాయాల మాత్రమే అయినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.